సాక్షి
కాకినాడ
ఆదివారం । 9 । ఫిబ్రవరి । 2025



రూ.1,01,116 విరాళం

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి ఎం.వీరునాయుడు, అప్పల నరసమ్మ దంపతులు (విశాఖపట్నం) శనివారం రూ.1,01,116 విరాళం సమర్పించారు.




పైడికొండలో ఆటో బోల్తా

తొండంగి మండలం పైడికొండ వద్ద 19 మంది ప్రయాణికులతో వెళ్తున్న ఆటో బోల్తా పడిన ఘటనలో.. 17 మంది తీవ్రంగా గాయపడ్డారు.

8లో

డెల్టాలకు 8,850 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు శనివారం 8,850 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 2,650, మధ్య డెల్టాకు 1,800, పశ్చిమ డెల్టాకు 4,400 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.90 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

రాజ్యాంగ పరిరక్షణకు నడుం బిగించాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీకాంత్



ఐఎల్‌ఏ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పృథ్వీరాజ్

కాకినాడ లీగల్: రాజ్యాంగ పరిరక్షణకు న్యాయవాదులు నడుం బిగించాలని సుప్రీం కోర్టు న్యాయవాది, ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ (ఐఎల్‌ఏ) జాతీయ అధ్యక్షుడు చింతల శ్రీకాంత్ పిలుపునిచ్చారు. కాకినాడ కోర్టు ఆవరణలోని జిల్లా ట్రెజరీ కార్యాలయం హాలు ఐఎల్‌ఏ జిల్లా సమావేశం శనివారం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీకాంత్ మాట్లాడుతూ, రాజ్యాంగ స్ఫూర్తిని సమాజానికి అందించడంలో పాలకులు విఫలమయ్యారని అన్నారు. ఐఎల్‌ఏ రాష్ట్ర అధ్యక్షుడు జి.శాంతకుమార్ మాట్లాడుతూ, న్యాయవాదుల సమస్యల పరిష్కారం దిశగా ఐఎల్‌ఏ కృషి చేస్తుందని చెప్పారు. ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ మాజీ వైస్ చాన్సలర్ డాక్టర్ బాబ్జీ మాట్లాడుతూ, సామాన్యులకు మెరుగైన న్యాయం అందించేందుకు న్యాయవాదులు కృషి చేయాలని కోరారు. కాకినాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ముత్తింటి విశ్వేశ్వరరావు మాట్లాడుతూ, ప్రజలకు చట్టాల పట్ల అవగాహన కల్పించాలని అన్నారు. న్యాయవాది టి.పృథ్వీరాజ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో న్యాయవాదులు జవహర్ అలీ, పిల్లి శ్రీనివాస్, జయలక్ష్మి, పితాని శ్రీనివాస్, సయ్యద్ సాలార్, ప్రసన్నకుమార్, జేవీ రమణ, సునీత తదితరులు పాల్గొన్నారు. ఐఎల్‌ఏ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా పృథ్వీరాజ్ ఐఎల్‌ఏ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నూతన కమిటీని రాష్ట్ర అధ్యక్షుడు శాంతకుమార్ నియమించారు. అధ్యక్షుడిగా టి.పృథ్వీరాజ్, ప్రధాన కార్యదర్శిగా పితాని వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా కోలా శ్రీహరి రావు, కార్యదర్శిగా వందే విజయ రాజ్‌కుమార్, కోశాధికారిగా జేవీ రమణ నియమితులయ్యారు.

బెల్టు షాపు తొలగించాలి

కోటనందూరు: అల్లిపూడిలో అక్రమంగా నిర్వహిస్తున్న బెల్టు షాపును తొలగించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చింతకాయల చినబాబు ఆధ్వర్యంలో స్థానిక పోలీసు స్టేషన్లో శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చినబాబు మాట్లాడుతూ గ్రామానికి చెందిన కొంత మంది టీడీపీ నేతలు గ్రూపుగా ఏర్పడి గ్రామ పెద్దలు, గ్రామస్తుల అనుమతి లేకుండా అల్లిపూడిలో అనధికారికంగా బెల్టు షాపు ఏర్పాటు చేశారన్నారు. మద్యం బాటిల్‌కు ఎంఆర్‌పీ కన్నా అదనంగా రూ.30 చొప్పున వసూలు చేస్తూ దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. బెల్టుషాపులు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం హెచ్చరిస్తున్నా.. గ్రామంలో ఏర్పాటు చేయడమేమిటని ప్రశ్నించారు. జనజీవనానికి ఇబ్బంది కలిగిస్తున్న ఈ షాపును తక్షణం తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 14న గ్రామంలో జరిగే కొండ రాజులుబాబు పండుగ సందర్భంగా గుండాట, కోడిపందేల నిర్వహణకు జూదరులతో స్థానిక నాయకులు రూ.8 లక్షలకు ఒప్పందం చేసుకున్నారని ఆరోపించారు. జూదం, కోడిపందేలకు తావు లేకుండా పండగ ప్రశాంత వాతావరణంలో సజావుగా జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

నయన మనోహరం



లక్ష్మీ నృసింహుని రథాన్ని లాగుతున్న భక్తులు





సముద్రంలో పుణ్య స్నానాలు ఆచరిస్తున్న భక్తకోటి

- వైభవంగా సాగిన లక్ష్మీ నృసింహుని రథోత్సవం
- సోదరి గుర్రాలక్కకు చీర, సారె సమర్పణ
- పెద్ద సంఖ్యలో హాజరైన భక్తులు
- విశేష సేవలందించిన ఆలయ అధికారులు

సాక్షి, అమలాపురం/ సఖినేటిపల్లి: అర్ధరాత్రి కనువిందు చేసిన లక్ష్మీ నృసింహుని కల్యాణం.. తెల్లవారు జాము నుంచే మొదలైన సముద్ర స్నానాలు.. అనంతరం శ్రీ, భూ సమేత నృసింహ స్వామి వార్ల దివ్య దర్శనం.. మధ్యాహ్నం పురవీధులను ఇల వెలసిన వైకుంఠంగా మార్చిన రథోత్సవం.. 24 గంటల పాటు వరుసగా సాగిన పుణ్య ఘట్టాలతో భక్తజన హృదయాలు ఆనందంతో ఉప్పొంగాయి.

భక్త వరదుడు అంతర్వేది లక్ష్మీ నృసింహ స్వామి వారి కల్యాణ మహోత్సవాలలో భాగంగా శనివారం ఏకాదశి (భీష్మ ఏకాదశి) పర్వదినాన నిర్వహించిన రథయాత్ర అపూర్వంగా నిలచి పోయింది. వివిధ జిల్లాల నుంచి వచ్చిన అసంఖ్యాకమైన భక్తుల గోవింద నామస్మరణలు, నరసింహస్వామికి జయజయధ్వానాల మధ్య ఈ రథ యాత్ర మనోహరంగా సాగింది.

కల్యాణం అనంతరం స్వామివారు తమ ఇంటి ఆడపడుచు గుర్రాలక్కకు చీర, సారె పెట్టేందుకు రథంపై ఊరేగుతూ మెరకవీధిలోని ఆలయం వద్దకు వెళ్లడం ఆనవాయితీ. రథయాత్రకు ముందు మంగళ వాయిద్యాలతో, అర్చకుల వేదమంత్రాలతో నూతన వధూవరులైన స్వామి, అమ్మవార్లను ఆలయం నుంచి పల్లకిలో రథం వద్దకు తోడ్కొని వచ్చారు. రథానికి భక్తులు అరటి గెలలు, గుమ్మడికాయలు కట్టించుకుని మొక్కులు తీర్చుకున్నారు. మొగల్తూరుకు చెందిన ఆలయ చైర్మన్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ రాజా కలిదిండి కుమార రామ గోపాల రాజా బహద్దూర్, ముఖ్య అతిథిగా రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ కొబ్బరి కాయలు కొట్టి రథయాత్రకు శ్రీకారం చుట్టారు. కొత్తపేట డీఎస్పీ మురళీ మోహన్, అమలాపురం ఆర్డీవో కె.మాధవి, ఎండోమెంట్స్ డీసీ రమేష్‌బాబు, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ, ఎంపీపీ వీరా మల్లిబాబు, ఉత్సవ సేవా కమిటీ చైర్మన్ దిరిశాల బాలాజీ, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మెరకవీధి నుంచి ప్రారంభమైన రథయాత్ర పల్లపువీధి మీదుగా పదహారు కాళ్ల మండపం వద్దకు చేరుకుంది. మార్గం మధ్యలో గుర్రాలక్కకు ఆలయ ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్ ఆధ్వర్యంలో స్థానాచార్య వింజమూరి రామ రంగాచార్యులు, వేదపండితుడు చింతా వేంకటశాస్త్రి, అర్చకులు స్వామి తరపున చీరె, సారె ఇచ్చారు.

పుణ్య స్నానాలు

స్వామివారి కల్యాణం అనంతరం శనివారం వేకువ జామున భీష్మ ఏకాదశి పర్వదినాన పెద్ద సంఖ్యలో భక్తులు పుణ్యస్నానాలు చేశారు. కల్యాణం అనంతరం ఉన్న భక్తులకు తోడు రథయాత్ర చూసేందుకు వచ్చిన భక్తులతో సాగరతీరం కిటకిటలాడింది. పలువురు తలనీలాలు సమర్పించి పుణ్యస్నానాలు చేయగా, మరికొందరు పితృ దేవతలకు తర్పణాలు వదిలారు. అనంతరం స్వామివారి దర్శనానికి బారులు తీరారు.





పితృ దేవతలకు పిండ ప్రదానాలు, తర్పణాలు ఇస్తున్న ప్రజలు

అంతర్వేదిలో నేడు

ఉత్సవాల్లో భాగంగా ఆరో రోజు ఆదివారం ఉదయం 3 గంటల నుంచి 6 గంటల వరకూ సుప్రభాత సేవ, స్వామి వారి తిరువారాధన, బాలభోగం, వార్షిక అభిషేకాలు, అనంతరం సాధారణ, ప్రత్యేక దర్శనాలు, సాయంత్రం 4 గంటలకు గజ వాహనంపై, రాత్రి 8 గంటలకు పొన్న వాహనంపై గ్రామోత్సవాలు నిర్వహించనున్నారు. భీష్మ ఏకాదశి రోజు నుంచి ఉపవాసం ఉండి మరునాడు ద్వాదశి తిథి నాడు విరమణ చేసే అర్చకులు స్వామికి అన్న దర్శనం చేయడం సంప్రదాయం. ఇందులో భాగంగా పాలమూరు సత్రం నిర్వాహకులతో అన్నపర్వత మహా నివేదన చేస్తారు. ఇది రాత్రి 7 గంటలకు జరగనుంది.

తొలి తిరుపతికి పోటెత్తిన భక్తులు



స్వామి వారి దర్శనానికి పోటెత్తిన భక్తులు

పెద్దాపురం: భీష్మ ఏకాదశి పర్వదినం సందర్భంగా తొలి తిరుపతి గ్రామంలో స్వయంభువుగా వెలసిన శృంగార వల్లభ స్వామి ఆలయానికి వేలాదిగా భక్తులు పోటెత్తారు. వేకువజాము నుంచే భక్తుల రాక ప్రారంభమైంది. వివిధ వాహనాలు, కాలి నడకన పెద్ద సంఖ్యలో భక్తులు తరలి రావడంతో ఆలయ ప్రాంగణం జనసంద్రాన్ని తలపించింది. సుమారు 35 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. శృంగార వల్లభ స్వామిని అర్చకులు పెద్దింటి నారాయణాచార్యులు, పురుషోత్తమాచార్యులు సుగంధ భరిత పుష్ప మాలలతో విశేషంగా అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ సేవల టిక్కెట్లు, అన్నదాన విరాళాలుగా స్వామి వారికి రూ.5,45,693 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ వడ్డి శ్రీనివాస్ తెలిపారు. 15 వేల మంది భక్తులకు ప్రసాద వితరణ, అన్నదానం ఏర్పాటు చేశామన్నారు.

రత్నగిరి.. భక్తజన గోదారి

- సత్యదేవుని దర్శించిన లక్ష మంది
- 13 వేల వ్రతాలు
- రూ.కోటి ఆదాయం

అన్నవరం: వరదల వేళ పోటెత్తే గోదారిలా.. భీష్మ ఏకాదశి పర్వదినం, రెండో శనివారం సెలవు కలసి రావడంతో.. రత్నగిరిపై భక్తజన ప్రవాహం పరవళ్లు తొక్కింది. సత్యదేవుని దర్శించేందుకు లక్ష మందికి పైగా భక్తులు తరలి వచ్చారు. ఆలయ ప్రాంగణం, వ్రత, విశ్రాంతి మండపాలన్నీ భక్తులతో కిక్కిరిసిపోయాయి. శుక్రవారం రాత్రి నుంచి శనివారం సాయంత్రం వరకూ భక్తులు స్వామివారి దర్శనానికి వెల్లువలా వస్తూనే ఉన్నారు. రద్దీని దృష్టిలో ఉంచుకుని సత్యదేవుని ఆలయాన్ని వేకువజామున ఒంటి గంటకే తెరచి, ప్రత్యేక పూజలు చేసిన అనంతరం భక్తులను స్వామివారి దర్శనానికి అనుమతించారు. తెల్లవారు జామున 2 గంటల నుంచి వ్రతాలు ప్రారంభించారు. స్వామివారి ఉచిత దర్శనానికి రెండు గంటల సమయం పట్టింది. రద్దీ కారణంగా అంతరాలయ దర్శనాలను మధ్యాహ్నం వరకూ నిలిపివేశారు. యంత్రాలయంలో ప్రదక్షిణ దర్శనం కూడా నిలిపివేశారు. వ్రత మండపాలు నిండిపోవడంతో స్వామివారి నిత్య కల్యాణ మండపంలో కూడా వ్రతాలు నిర్వహించారు. దీంతో ఉదయం 11 గంటలకు స్వామివారి నిత్యకల్యాణం ప్రారంభించారు. భక్తుల ద్వారా దేవస్థానానికి రూ.కోటికి పైగా ఆదాయం వచ్చిందని అధికారులు తెలిపారు. సుమారు 13 వేల వ్రతాలు జరిగాయి. ఆలయం, వ్రత మండపాలు, క్యూలైన్ల వద్ద ఏర్పాట్లను దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ వీర్ల సుబ్బారావు పర్యవేక్షించారు. పది వేల మంది భక్తులకు సర్క్యులర్ మండపంలో పులిహోర, దద్ధోజనం పంపిణీ చేశారు. రామాలయం వద్ద విశ్రాంతి మండపంలోను, పలుచోట్ల ఏర్పాటు చేసిన షామియానాల్లోను భక్తులు సేద తీరారు.

స్వర్ణ పుష్పాలు, చామంతులతో అర్చన

ఏకాదశిని పురస్కరించుకుని సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీ దేవి అమ్మవారికి ఉదయం 7 గంటలకు స్వర్ణ పుష్పాలతో, 9 గంటలకు చామంతులతో అర్చన నిర్వహించారు. భీష్మ ఏకాదశి సందర్భంగా సత్యదేవుని ఆలయ ప్రాంగణాన్ని వివిధ రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. వార్షిక కల్యాణ మండపం వద్ద పుష్పాలతో ఏర్పాటు చేసిన శ్రీకృష్ణుడు, భీష్ముడు, అర్జునుడి ఫ్లెక్సీల వద్ద ఫొటోలు దిగడానికి భక్తులు పోటీలు పడ్డారు.

సాఫీగా దర్శనాలు

భీష్మ ఏకాదశి రద్దీని దృష్టిలో ఉంచుకుని రెండు రోజులుగా చేసిన ఏర్పాట్లు సత్ఫలితాలనిచ్చాయి. ప్రధానంగా పశ్చిమ రాజగోపురం వద్ద ఏర్పాటు చేసిన కంపార్ట్‌మెంట్ల వలన భక్తులను నియంత్రించడం సులువైంది. ఆలయం వద్ద క్యూ లైన్లు ఖాళీ అవగానే కంపార్ట్‌మెంట్లలోని భక్తులను లోపలకు అనుమతిస్తూ ఎక్కడా తొక్కిసలాట జరగకుండా ఏర్పాట్లు చేశారు. దీంతో తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకూ భక్తులు సాఫీగా స్వామివారి దర్శనం చేసుకున్నారు. మంచి నీటి సరఫరాలో కూడా ఎక్కడా ఇబ్బంది కలగలేదు.

ఇవీ ఇబ్బందులు

- సత్యదేవుని సన్నిధిలో రూ.1,500 టికెట్టు వ్రతాల కోసం గతంలో అనివేటి మండపాన్ని రెండుగా విభజించి మధ్యలో చాపలు కట్టేవారు. రెండుచోట్లా పురోహితులు విడిగా వ్రతాలు చేయించేవారు. అయితే రద్దీ కారణంగా మధ్యలో కట్టిన చాపలను శనివారం తొలగించి, ఒకే బ్యాచ్‌గా వ్రతాలు చేశారు. ఒకే ఒక్క పురోహితుడు ధ్వజస్తంభం ముందు నిలబడి ఆవాహన, పూజ చేయించి వ్రత కథ చెప్పారు. దీంతో ధ్వజస్తంభానికి ఎడమవైపు మండపంలో ఉన్నవారు అదంతా మైకులో విని చేయాల్సి రావడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. గతంలో వీరికి ఎదురుగా ఇంకో పురోహితుడు ఇవన్నీ చేయించేవారు.
- తల్లులు తమ పసి పిల్లలకు పాలిచ్చేందుకు ఎక్కడా మరుగు లేక ఇబ్బంది పడ్డారు. గతంలో ఆలయం వద్ద, వ్రత మండపాల వద్ద మిల్క్ ఫీడింగ్ సెంటర్ల పేరుతో క్యాబిన్లు, వాటిలో కుర్చీలు ఉండేవి. ఇప్పుడు పీఆర్వో కార్యాలయం వద్ద తప్ప ఎక్కడా లేవు.
- ఎక్కడా తాత్కాలిక టాయిలెట్లు ఏర్పాటు చేయలేదు. దీంతో పశ్చిమ రాజగోపురం ఎదురుగా, రామాలయం కుడివైపున ఉన్న టాయిలెట్లే భక్తులకు దిక్కయ్యాయి.



సత్యదేవుని దర్శనానికి కిక్కిరిసిన భక్తులు



స్వామివారి ఆలయం వెలుపల ఆకట్టుకున్న పుష్పాలంకరణ

ఆసరాకు టోకరా

నాడు

గుండెపోటు, వివిధ వ్యాధులు, ప్రమాదాల బారిన పడి, ఆసుపత్రిలో శస్త్రచికిత్స చేయించుకున్న వారు తరువాత కొంత కాలం పాటు ఎటువంటి పనులూ చేసుకోలేని దుస్థితిలో ఉంటారు. ఏ పనికీ వెళ్లలేక, ఆదాయం పడిపోయి కుటుంబ పోషణకు ఇబ్బంది పడతారు. ఫలితంగా సరైన ఆహారం తీసుకోలేక త్వరగా కోలుకోలేరు. దీనిని గుర్తించిన గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. ఆరోగ్య ఆసరా పథకాన్ని రూపొందించారు. ఆరోగ్యశ్రీ పథకంలో శస్త్రచికిత్స అనంతరం రోగులు ఇంటి వద్ద విశ్రాంతి తీసుకునే సమయంలో.. వారి జీవనోపాధికి నాటి వైఎస్సార్ సీపీ పాలనలో భృతి చెల్లించేవారు. తద్వారా ఎంతో మందికి ఆర్థిక భరోసా కల్పించారు.

నేడు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆరోగ్యశ్రీ పథకం కింద శస్త్రచికిత్స చేయించుకున్న రోగులకు ఆరోగ్య ఆసరా సాయాన్ని నిలిపివేసింది. డిశ్చార్జ్ అయ్యి నెలలు గడుస్తున్నా తమ ఖాతాలకు డబ్బులు జమ కాకపోవడంతో రోగులు ఆవేదన చెందుతున్నారు. ఇటు ప్రభుత్వ 'ఆసరా' లేక.. అటు పని చేసే ఓపిక లేక నెలల తరబడి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం సాయం అందించక పోతుందా అని ఆశగా ఎదురు చూస్తున్నారు. కానీ, చంద్రబాబు సర్కార్ ఏమాత్రం కనికరం చూపించకుండా వారికి టోకరా వేసింది.

- నాడు ఆరోగ్యశ్రీ లబ్ధిదారులకు జగన్ సర్కార్ వరం
- శస్త్రచికిత్స అనంతరం డిశ్చార్జ్ అయిన 48 గంటల్లో ఆర్థిక సాయం
- నేడు నయాపైసా విదల్చని కూటమి సర్కార్
- ఒక్క జీజీహెచ్‌లోనే 1,800 మందికి పైగా ఎదురుచూపులు
- జిల్లావ్యాప్తంగా వేలాది మంది నిరీక్షణ



కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న పేదలు (ఫైల్)

కాకినాడ సిటీ: గత ప్రభుత్వ హయాంలో డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం పేద, మధ్య తరగతి వర్గాల్లో ఎంతో మంది ప్రాణాలను నిలబెట్టింది. ఈ పథకం ద్వారా నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో సుమారు 3,200కు పైగా ప్రొసీజర్లకు ఉచితంగా వైద్యం అందేది. అప్పట్లో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో మొత్తం 16,21,397 మందికి ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేశారు. చికిత్స వ్యయం రూ.1,000 దాటిన ప్రతి ప్రొసీజర్‌నూ ఆరోగ్యశ్రీ పరిధిలోకి తెచ్చారు. కరోనా చికిత్సను సైతం దీని పరిధిలోకి తీసుకు రావడంతో ఈ పథకం రోగులకు ఎంతో అక్కరకు వచ్చింది. అంతే కాదు.. తదనంతర కాలంలో ఈ పథకం కింద చికిత్స పరిమితిని ఏకంగా రూ.25 లక్షలకు నాటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెంచారు. హైదరాబాద్, చెన్నై, బెంగళూరు వంటి నగరాల్లో సైతం వైద్య సేవలు పొందే అవకాశం కల్పించారు. దీంతో చేతిలో డబ్బులు లేకపోయినా బాధితులు ఏమాత్రం ఆందోళన చెందకుండా కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఉచితంగా వైద్యం పొందేవారు.

డిశ్చార్జ్ అయిన 48 గంటల్లో..

ఇలా ఉచిత వైద్యమే కాదు.. శస్త్రచికిత్స చేయిం**చుకున్న రోగుల**ు తమ పోషణకు ఇబ్బంది పడ**కూడదనే ఉద్దేశ**ంతో దేశంలోనే ఎక్కడా లేని **విధంగా వినూత్న** రీతిలో ఆరోగ్య ఆసరా **పథకాన్ని సైతం** అమలు చేసింది గత **ప్రభుత్వం.** మొత్తం 1,536 మెడికల్ ప్రొసీ**జర్లకు ఈ పథక**ాన్ని వర్తింపజేసింది. దీని ద్వారా శస్త్రచికిత్స చేయించుకున్న వారు వైద్యుల సూచనల మేరకు ఇంటివద్ద విశ్రాంతి తీసుకునే కాలానికి ఆర్థిక సాయం అందించేది. రోజుకు రూ.225 చొప్పున గరిష్ఠంగా నెలకు రూ.5 వేల వరకూ ఈవిధంగా చెల్లించేవారు. ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయిన 48 గంటల్లోగా రోగి ఖాతాకు ఈ సొమ్ము జమ చేసేవారు. రోగులు కోలుకోవడానికి, వారి కుటుంబ పోషణకు ఈ సాయం ఎంతో ఉపయోగపడేది.

'ఆసరా' కోసం ఆశగా..

గత ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఒకవైపు పేదలకు అపర సంజీవనిగా ఉన్న ఆరోగ్యశ్రీ పథకాన్ని ఎత్తివేసేందుకు ప్రయత్నిస్తోంది. ఈ పథకం పేరును ఎన్టీఆర్ వైద్య సేవగా మార్చింది. దీని స్థానంలో ఆరోగ్య బీమా పథకాన్ని తీసుకురావాలని యోచిస్తోంది. మరోవైపు ఆరోగ్య ఆసరా సాయాన్ని నిలిపివేసింది. దీంతో ఎన్టీఆర్ వైద్య సేవ కింద నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో శస్త్రచికిత్సలు చేయించుకున్న వారు కొద్ది నెలలుగా ఆసరా సాయం కోసం నిరీక్షిస్తున్నారు. ప్రభుత్వ సాయం అందక మందులు, పోషణ కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లాలో ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులు 31 ఉన్నాయి. వీటిలో అధిక సంఖ్యలో రోగులు ఆరోగ్యశ్రీ పథకం కింద వైద్య సేవలు పొందుతూ డిశ్చార్జ్ అవుతున్నారు. వీరందరికీ ప్రభుత్వం కొద్ది రోజులుగా ఆరోగ్య ఆసరా డబ్బులు ఇవ్వడం లేదు. ఈవిధంగా ఒక్క కాకినాడలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి(జీజీహెచ్) లోనే చికిత్స పొంది, డిశ్చార్జ్ అయిన సుమారు 1,800 మంది ఆసరా డబ్బుల కోసం నెలల తరబడి ఆశగా ఎదురు చూస్తున్నారు. ఇక జిల్లాలోని నెట్‌వర్క్ ఆసుపత్రులన్నీ కలిపితే వీరి సంఖ్య వేలల్లో ఉంది. ఆరోగ్యశ్రీ పథకాన్ని నిర్వీర్యం చేయడంలో భాగంగానే ప్రభుత్వం 'ఆసరా'ను కూడా నిలిపివేసిందని పలువురు ఆవేదన చెందుతున్నారు. వెంటనే ఈ పథకాన్ని అమలు చేయాలని, తమకు ఆర్థిక సాయం అందజేయాలని బాధితులు కోరుతున్నారు.

ప్రశాంతంగా నవోదయ పరీక్షలు



నవోదయ విద్యాలయ పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న తహసీల్దార్ వెంకటలక్ష్మి

పెద్దాపురం: జవహర్ నవోదయ విద్యాలయలో 9, 11 తరగతుల్లో ప్రవేశానికి శనివారం నిర్వహించిన పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కె.రామకృష్ణయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షల నిర్వహణకు పెద్దాపురం, సామర్లకోట పట్టణాల్లో 9 కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. 9వ తరగతి ప్రవేశ పరీక్షకు 1,451 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 858 మంది హాజరయ్యారన్నారు. అలాగే, 11వ తరగతి ప్రవేశ పరీక్షకు 699 మంది దరఖాస్తు చేసుకోగా 484 మంది హాజరయ్యారని తెలిపారు. 9వ తరగతికి 13 మందిని 11వ తరగతికి 20 మందిని ఎంపిక చేస్తారని పేర్కొన్నారు. వారు 12వ తరగతి వరకూ ఇక్కడ చదువుతారన్నారు. కిర్లంపూడి డిప్యూటీ తహసీల్దార్ కూన సాయికిరణ్ ఫ్లయింగ్ స్క్వాడ్‌గా వ్యవహరించారు. పరీక్ష కేంద్రాలను పెద్దాపురం తహసీల్దార్ వెంకటలక్ష్మి, నవోదయ అధికారులు తనిఖీ చేశారు.

క్లుప్తంగా

అనారోగ్యంతో వృద్ధుడి ఆత్మహత్య

కొత్తపేట: కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఒక వృద్ధుడు గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానిక పోలీస్ స్టేషన్ హెచ్‌సీ రమేష్‌బాబు తెలిపిన వివరాల మేరకు మండల పరిధిలోని వానపల్లి శివారు సంగంపాలెం గ్రామానికి చెందిన ఇళ్ల పళ్లంశెట్టి (79) నాలుగేళ్ల క్రితం గుండెపోటుకు గురై స్టంట్ వేయించుకున్నాడు. అప్పటి నుండి ఆరోగ్యం సరిగా లేక బాధపడుతున్నాడు. ఆ బాధ తాళలేక ఈ నెల 7న సాయంత్రం గడ్డి మందు తాగాడు. ఇది గమనించిన అతని బంధువులు కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లగా ప్రాథమిక చికిత్స చేసి, మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతి చెందాడు. పళ్లంశెట్టి కుమారుడు ఇళ్ల కోప్పేశ్వరరావు ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్టు హెచ్‌సీ తెలిపారు.

ప్రమాదవశాత్తూ వ్యక్తి మృతి

పిఠాపురం: గొల్లప్రోలు మండలం చేబ్రోలులో శనివారం ఎలక్ట్రికల్ వర్కు చేస్తూ బిల్డింగ్ మీద నుంచి పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కొత్తపల్లి మండలం వాకతిప్పకు చెందిన మిరియాల శ్రీనివాస్ ఎలక్ట్రికల్ వర్క్ చేస్తుంటాడు. చేబ్రోలులో ఒక ఇంట్లో వర్క్ చేస్తుండగా బిల్డింగ్ మీద నుంచి ప్రమాదావశాత్తూ పడి పోగా అతడిని చికిత్స కోసం కాకినాడలో ఒక ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ సంఘటనకు సంబంధించి ఎటువంటి ఫిర్యాదు అందలేదని గొల్లప్రోలు పోలీసులు తెలిపారు.

మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో పతకాలు

నాగమల్లితోట జంక్షన్: రాజస్థాన్‌లో ఈ నెల 6 నుంచి 8వ తేదీ వరకూ నిర్వహించిన 44వ నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్స్ ఓపెన్ చాంపియన్‌షిప్ మీట్‌లో కాకినాడకు చెందిన యాతం నాగబాబు పతకాలు సాధించారు. డీఎంహెచ్‌ఓ మలేరియా విభాగంలో సబ్ యూనిట్ అధికారిగా విధులు నిర్వహిస్తున్నారు. ఓపెన్ చాంపియన్‌షిప్‌లో నాగబాబు 100, 200, 400, 800 మీటర్లలో మూడో స్థానాల్లో నిలిచి కాంస్య పతకాలు సాధించారు. అలాగే 4×400 మీటర్ల రిలే పరుగులో మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకం, 4× 100 మీటర్ల రిలే పరుగులో రెండో స్థానం సాధించారు.


మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి కల్యాణాన్ని నిర్వహిస్తున్న పండితులు


కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తజనం

కమనీయం భీమనాథుని కల్యాణం

- పట్టు వస్త్రాలు సమర్పించిన టీటీడీ అధికారులు
- శోభాయమానంగా ఆలయ ప్రాంగణం
- వేలాదిగా తరలివచ్చిన భక్తజనం



ద్రాక్షారామ భీమేశ్వరునికి లక్ష రుద్రాక్ష పూజ


పట్టు వస్త్రాలను సమర్పిస్తున్న టీటీడీ అధికారులు

రామచంద్రపురం రూరల్: పంచారామ క్షేత్రం, త్రిలింగ క్షేత్రాల్లో ఒకటి, అష్టాదశ శక్తి పీఠాల్లో 12వది అయిన ద్రాక్షారామ మాణిక్యాంబ సమేత భీమేశ్వర స్వామి వారి కల్యాణం శనివారం కన్నుల పండువగా నిర్వహించారు. ఎక్కడా లేని విధంగా మూల విరాట్ మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి వారితో పాటు క్షేత్ర పాలకులైన లక్ష్మీ సమేత నారాయణస్వామి, చండికా సమేత సూరేశ్వరస్వామి వారల దివ్య కల్యాణాన్ని ఒకే వేదికపై తిలకించి భక్తులు పరవశులయ్యారు. ఆలయ ఈఓ, దేవదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ అల్లు వెంకట దుర్గా భవాని నేతృత్వంలో విశేష పుష్పాలంకరణలు చేశారు. దేవస్థానం బ్రహ్మ దేవులపల్లి ఫణి రామకృష్ణ, ఆలయ అర్చకులు, దేవస్థానం వైదిక బృందం ఆధ్వర్యంలో ఉదయం కల్యాణమూర్తులుగా అలంకరించి అనంతరం ఎదురు సన్నాహం నిర్వహించారు. భీమేశ్వరస్వామి వారికి దాత సత్తి సుబ్బారెడ్డి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో లక్ష రుద్రాక్ష పూజ నిర్వహించారు. సాయంత్రం అంకురార్పణ, ధ్వజారోహణం చేశారు. నంది వాహనంపై స్వామివార్లకు గ్రామోత్సవం నిర్వహించారు. ఆరుద్రా నక్షత్రయుక్త తులా లగ్నంలో రాత్రి 11.05 గంటలకు శిరస్సులపై జీలకర్ర, బెల్లం ఉంచి మాంగళ్యధారణ చేయించారు. అనంతరం ముత్యాల తలంబ్రాలు, నీరాజన మంత్రపుష్పాలతో కల్యాణం ముగిసింది. భక్తులు అధిక సంఖ్యలో హాజరై భీమనాథుని కల్యాణాన్ని కనులారా తిలకించారు. కల్యాణ మూర్తులకు మంత్రి వేణు దంపతులు, తిరుమల తిరుపతి దేవస్థానం తరపున అధికారులు మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి వారిని అలంకరించే నిమిత్తం ఈ ఓ దుర్గా భవానికి అందజేశారు.

వైభవం.. కుంతీమాధవుని పరిణయం

- పిఠాపురం మహారాజా పేరున తొలి అర్చన
- గజ వాహనంపై గ్రామోత్సవం


గజవాహనంపై స్వామివారి గ్రామోత్సవం


కల్యాణ అలంకారంలో కుంతీమాధవస్వామి రాజ్యలక్ష్మి అమ్మవార్లు

పిఠాపురం: పంచమాధవ క్షేత్రాలలో ఒకటైన కుంతీమాధవ స్వామి వారి దివ్య కల్యాణం పిఠాపురంలో శనివారం వైభవంగా జరిగింది. ఉదయం పిఠాపురం మహారాజా రాజా రావు వేంకట కుమార మహీపతి సూర్యారావు బహుద్దూర్ పేరున తొలి అర్చన చేసిన అర్చకులు అధిక సంఖ్యలో వచ్చిన భక్తజనం నడుమ కుంతీమాధవస్వామి, రాజ్యలక్ష్మి అమ్మవార్ల పరిణయాన్ని వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం భక్తుల ఆధ్వర్యంలో స్వామి అమ్మ వార్లను వధూవరులుగా తీర్చిదిద్ది కల్యాణ మంటపం వద్ద ఎదురు సన్నాహం నిర్వహించారు. గజ వాహనంపై గ్రామోత్సవం అనంతరం విగ్రహాలను పట్టు వస్త్రాలు, నగలతో అలంకరించారు. అనంతరం వారిని ఊరేగింపుగా తీసుకు వచ్చి సర్వాంగ సుందరంగా అలంకరించిన వేదికపై కూర్చుండబెట్టారు. వేద పండితుల ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు చక్రవర్తుల నరసింహాచార్యులు, చక్రవర్తుల మాధవాచార్యులు ఆధ్వర్యంలో విష్వక్సేన పూజతో కల్యాణాన్ని ప్రారంభించారు. పుణ్యాహవాచనం, కంకణధారణ, సుముహూర్తం, కన్యాదానం, మంగళసూత్రధారణ, యజ్ఞోపవీత ధారణ, తలంబ్రాలు, ఆశీర్వచనం తదితర పూజలను సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. భారీగా తరలివచ్చిన భక్తుల హరినామ స్మరణతో కల్యాణం కమనీయంగా సాగిపోయింది. కార్యక్రమంలో ఆలయ ఈఓ శ్రీరాములు, పలువురు ప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు. ఉదయం టీటీడీ వేద పండితులు అల్లంరాజు కల్యాణ కామేశ్వర సూర్యనారాయణ ఘనపాఠి ఆధ్వర్యంలో వేద పారాయణం నిర్వహించారు.


జి.మామిడాడ రథోత్సవంలో భక్తుల కోలాహలం

ఆదిత్యునికి అంగరంగ వైభవంగా..


స్వామివారి కల్యాణంలో భాగంగా అమ్మవారు, అయ్యవార్లపై క్షీరాభిషేకం చేస్తున్న అర్చకులు

పెదపూడి: గోవింద నామస్మరణ నడుమ ఉష, ఛాయ, పద్మిని, సౌంజ్ఞ సమేత సూర్యనారాయణుని కల్యాణం శనివారం వైభవంగా జరిగింది. వేద మంత్రాలు, మంగళవాయిద్యాలు, భక్తుల సందడితో స్వామి వారి కల్యాణం నయన మనోహరంగా సాగింది. అలాగే మధ్యాహ్నం 1.05 గంటలకు స్వామి వారి రథోత్సవాన్ని ఘనంగా ప్రారంభించారు. దేశంలోనే ఏకైక వైష్ణవ సాంప్రదాయంలో పూజాదికాలు అందుకునే ఆలయంగా మండలంలోని జి.మామిడాడ గ్రామంలోని సూర్యదేవాలయం ప్రసిద్ధిగాంచింది. భీష్మ ఏకాదశి శనివారం రాత్రి స్వామి వారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త, ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కొవ్వూరి శ్రీనివాస బాలకృష్ణారెడ్డి దేవదాయ శాఖ తరుపున స్వామి, అమ్మవార్లకు పట్టు వస్త్రాలను సమర్పించారు. ఆలయ ప్రధాన అర్చకుడు రేజేటి వెంకట నరసింహాచార్యులు ఆధ్వర్యంలో 15 మంది పండితులు స్వామి వారి కల్యాణాన్ని నిర్వహించారు. రాత్రి 8.30 గంటలకు సుముహూర్తం, స్వామివారి కల్యాణం వైభవంగా సాగాయి. ఆలయ ఈఓ పాటి సత్యనారాయణ, ఉత్సవ కమిటీ ప్రతినిధుల పర్యవేక్షణలో ఏర్పాట్లు చేశారు. తెల్లవారు జాము 3.30 నిముషాల నుంచే స్వామివారిని మేల్కొలిపి భక్తులకు దర్శనాలు కల్పించారు. ఉదయం 11.30 గంటలకు ఆలయంలోని ఉత్సవ మూర్తులను పల్లకిలో రథంలో ఆసీనులను చేశారు. పూజల అనంతరం మధ్యాహ్నం 1.05 గంటలకు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త, ట్రస్ట్ బోర్డు చైర్మన్ కొవ్వూరి శ్రీనివాస బాలకృష్ణారెడ్డి, ఉత్సవ కమిటీ ప్రతినిధులు రథోత్సవాన్ని ప్రారంభించారు. మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి స్వామి వారిని దర్శించుకుని రథోత్సవంలో పాల్గొన్నారు. స్థానిక ఎస్సై కె.రామారావు అధ్వర్యంలో బందోబస్తు నిర్వహిస్తున్నారు.

ముద్రగడపై దాడికి ప్రభుత్వం బాధ్యత వహించాలి

కొత్తపేట మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

కిర్లంపూడి: మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నేత ముద్రగడ పద్మనాభం ఇంటిపై జరిగిన దాడికి కూటమి ప్రభుత్వం బాధ్యత వహించి తక్షణం స్పందించాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి డిమాండ్ చేశారు. అక్కడి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, సర్పంచ్‌లు శనివారం స్థానిక ముద్రగడ ఇంటికి వెళ్లి ఆయనకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా జగ్గిరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ రాజకీయంగా ముద్రగడకు ఉన్న ఖ్యాతి, ఆయన కుటుంబానికి ప్రజల్లో ఉన్న ప్రేమాభిమానాలు వెలకట్టలేనివని అన్నారు. ఆయనపై జరిగిన దాడిని అన్ని రాజకీయ పార్టీలు ఖండించాలన్నారు. కడపలో ఎంపీడీఓను ఎవరో తిట్టారని పవన్ కళ్యాణ్ అడుగుతున్నారు కానీ సాక్షాత్తు ముద్రగడ పద్మనాభం ఇంటి పైనే దాడి చేస్తే ఇప్పటి వరకు కూటమి ప్రభుత్వం స్పందిచలేదంటే ఆయనపై మీ వైఖరి ఎంటో అర్థమౌతుందన్నారు. ప్రశ్నించే నైజం గల వ్యక్తినని చెప్పుకునే పవన్‌కళ్యాణ్ ఒక కులానికి, సమాజానికి మార్గదర్శిగా, రాజకీయంగా నైతిక విలువలు ఉన్న ముద్రగడపై దాడి జరిగితే ఎందుకు ప్రశ్నించడం లేదని, చంద్రబాబు మీ నోరు నొక్కేస్తున్నారా అని జగ్గిరెడ్డి ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం వైఖరి చూస్తుంటే ముద్రగడకు రక్షణ లేదని భావిస్తున్నానన్నారు. ప్రజల్లో వస్తున్న వ్యతిరేకతతో దాడికి పాల్పడిన వ్యక్తిని జైల్లో పెట్టి ప్రభుత్వం చేతులు దులుపుకొందన్నారు. సమస్యలపై ప్రశ్నించే పవన్‌కల్యాణ్ నోరుపై చంద్రబాబు చేయి తీసి ఆయనకు ప్రశ్నించే స్వేచ్ఛను ఇవ్వాలన్నారు. ఇకనైనా ప్రతిపక్ష పార్టీ నాయకులపై దాడులు ఆపాలని, ఇదే వైఖరి కొనసాగిస్తే రానున్న రోజుల్లో ప్రజలే బుద్ధిచెబుతారన్నారు. ఆయనకు సంఘీభావం తెలిపిన వారిలో గొల్లపల్లి డేవిడ్, ఎంపీపీలు మార్గని గంగాధర్, తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీలు బోనం సాయిబాబు, తోరాటి రాంబాబు, జవ్వాది రవిబాబు, మునునూరి వెంకటేశ్వరరావు, చికారమిల్లి చిన్న, కర్రి నాగిరెడ్డి తదితరులు ఉన్నారు.


ముద్రగడతో మాట్లాడుతున్న చిర్ల జగ్గిరెడ్డి

పైడికొండలో ఆటో బోల్తా

- డ్రైవర్ సహా 17 మంది మహిళలకు తీవ్రగాయాలు
- క్షతగాత్రులంతా రొయ్యల కంపెనీ కార్మికులు



ఆటో బోల్తాపడిన ఘటనలో తీవ్ర గాయాలపాలైన మహిళలు


ఘటనా స్థలంలో నుజ్జైన ఆటో, గాయాలపాలైన మహిళలు

తొండంగి: ముగ్గురు మాత్రమే ప్రయాణించాల్సిన ఆటోలో డ్రైవర్‌తో కలిపి 19 మంది ప్రయాణించడంతో ఆటో అదుపుతప్పి పల్టీలు కొట్టడంతో 17 మంది తీవ్ర గాయాలపాలయ్యారు. తొండంగి మండలం పైడికొండలో శనివారం జరిగిన ఘటనకు సంబంధించి స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు కృష్ణాపురంలో అవంతి రొయ్యల కంపెనీలో పని చేసేందుకు అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలం పెదరామభద్రాపురం నుంచి ఆటో వెళ్తుంది. శనివారం ఉదయం పెదరామభద్రాపురం, శ్రీరాంపురం గ్రామాలకు చెందిన కూలీలను ఎక్కించుకుని ఆనూరు, పైడికొండ మీదుగా వెళ్తుండగా అక్కడి మలుపు వద్ద చెట్లు కొట్టేసి రహదారిపై వదిలేసిన ప్రదేశం వద్ద ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న డ్రైవర్ పట్నాల సంతోష్, 16 మంది మహిళా కూలీలు తీవ్రంగా గాయపడ్డారు. అంత మంది ఒకేసారి గాయాలపాలవడంతో ఆ ప్రాంతం రోదనలతో మిన్నంటింది. ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు వాహనాలు సరిపోకపోవడంతో కొద్ది మంది ప్రమాదం జరిగిన ప్రదేశంలోనే ఆర్తనాదాలు చేశారు. వెంటనే స్థానికులు వైద్యం నిమిత్తం వారందరినీ తుని ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఎస్సై జగన్మోహన్‌రావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గాయపడినవారి వివరాలివీ....

ఈ ప్రమాదంలో అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలం పెదరామభద్రాపురానికి చెందిన నక్కిన లక్ష్మి, ఎస్.లక్ష్మి, కనకం దేవి, మంతిన రమణమ్మ, పులి లోవకుమారి, గెడ్డమూరి సీతారత్నం, కోటిన లక్ష్మి, పగడం చిన్నమ్ములు, జీలం పద్మ, తుంపాల అనంతలక్ష్మి, ఉగ్గిన దేవి, ఉగ్గిన సత్యవతి, నంగిన పద్మ, శ్రీలం ధనలక్ష్మి, కర్రి లక్ష్మి, నారిపిరెడ్డి నాగమణి, పట్నాల సంతోష్ (ఆటో డ్రైవర్)లకు తలకు, కుడిభుజం, కాళ్లు, చేతులు, నడుము విరగడం వంటి తీవ్రగాయాలయ్యాయి. వీరికి తుని ఏరియా ఆస్పత్రిలో వైద్యం అందిస్తున్నారు. మెరుగైన వైద్యం కోసం కొంత మందిని కాకినాడ ఆస్పత్రికి తరలించారు. అధిక లోడుతో పాటు మితిమీరిన వేగమే ప్రమాదానికి కారణమని స్థానికులు చెప్తున్నారు.

ఏటీఎం కార్డులు మార్చి నగదు చోరీ

- పోలీసుల అదుపులో ఇద్దరు నిందితులు
- రూ.2.6 లక్షల నగదు, 23 ఏటీఎం కార్డుల స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రమేష్‌బాబు, సీఐ బాజీలాల్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఏటీఎం సెంటర్ల వద్ద వేచి చూసి నగదు తీసుకోవడంలో ఇబ్బంది పడుతున్న వారికి సాయం చేస్తున్నట్టు నటిస్తూ వారి ఏటీఎం కార్డులు తస్కరించి ఆనక నగదు చోరీ చేస్తున్న ఇద్దరు పాత నేరస్తులను స్థానిక ప్రకాశ్ నగర్ పోలీసులు అరెస్టు చేశారు. సెంట్రల్ జోన్ డీఎస్పీ కె.రమేష్ బాబు, స్టేషన్ ఇన్‌స్పెక్టర్ బాజీలాల్ శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు తెలిపారు. ప్రకాష్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఏటీఎంల వద్ద నేరగాళ్లు తిరుగుతున్నారన్న సమాచారంతో ఇన్‌స్పెక్టర్ బాజీలాల్ ఆధ్వర్యంలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. మోరంపూడి జంక్షన్‌లోని ఏటీఎం సెంటర్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న చల్లమూరు వెంకట భాస్కరరావు, పొన్నాడ కిరణ్‌లను గుర్తించి ప్రశ్నించగా పొంతన లేని సమాధానం చెప్పడంతో వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. వారిది విజయనగరం జిల్లా గజపతి నగరం ప్రాంతం పురిటిపెంట గ్రామంగా తెలిపారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పరిశీలించగా భాస్కరరావు పాత నేరస్తుడిగా తేలింది. అతడు విజయనగరం, విశాఖపట్నం, పెందుర్తి, విజయవాడ, భీమిలి ప్రాంతాల్లో ఏటీఎంల వద్ద నేరాలు చేసినట్లు గుర్తించారు. అతనిపై 15 కేసులు ఉన్నాయని, పలుమార్లు జైలుకు వెళ్లి వచ్చినట్లుగా పోలీసు రికార్డులు తెలిపాయి. మరో వ్యక్తి పొన్నాడ కిరణ్ ఇంటి దొంగతనం కేసులో నేరస్తుడిగా తెలిసింది. వారిని మరింత లోతుగా విచారించగా నగర పరిధిలో చేసిన నేరాలు ఒప్పుకున్నారు. వీరిద్దరూ ఒకే ఊరికి చెందిన వారు కావడంతో గత ఏడాది నవంబర్ నుంచి ఏటీఎం సెంటర్లో వద్ద దొంగతనాలు చేయడం మొదలు పెట్టారు. ఎంటీఎం సెంటర్లలో వృద్ధులు, పిల్లలకు సాయం చేస్తున్నట్టు నటించి ఏటీఎం కార్డు పిన్ నంబరు తెలుసుకుని అప్పటికే వారి వద్ద ఉన్న అదే బ్యాంకుకు చెందిన మరో ఏటీఎం కార్డు ఇచ్చి పంపేస్తారు. ఆనక ఆ కార్డును వేరే ఏటీఎంలలో పెట్టి నగదు ఊడ్చేస్తారు. ఇలా వారు ప్రకాష్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మూడు దొంగతనాలు, టూ టౌన్, రాజానగరం, రావులపాలెం, ఏలూరు పోలీస్ స్టేషన్ల పరిధిలో ఏటీఎం సెంటర్ వద్ద దొంగతనాలు చేసినట్లుగా పోలీసులు విచారణలో అంగీకరించారు. వారి నుంచి రూ.2.6 లక్షలు నగదు, 23 ఏటీఎం కార్డులు, మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తులో ప్రతిభ కనపరిచిన, ఇన్‌స్పెక్టర్ ఆర్‌ఎస్‌కే బాజీలాల్, ఎస్సై శివప్రసాద్, హెచ్‌సీ ఎస్.రాంబాబు, పీసీలు కె.ప్రదీప్‌కుమార్, ఎస్.వీరబాబులను జిల్లా ఎస్పీ అభినందించారు.